





# యాంత్రీకరణపై.. ఆశలు!

కామారెడ్డి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): యాంత్రికరణ పథకం పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ట్రాక్టర్‌లు, ఇతర పరికరాలతోనే సాగు చేసేందుకు రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. కూలీల సమస్యలు అధిగమించడంతో పాటు పనులు త్వరగా పూర్తయ్యేందుకు ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. వ్యవసాయ యంత్రాలపై రాయితీ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో వారికి ఊరట లభించనుంది. ఈ యాసంగి సీజన్ నుంచే ఈ పథకం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో నిధులు సైతం విడుదల చేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.99 లక్షల మంది రైతులు ఉండగా 6 లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగవుతున్నాయి. వివిధ పంటల సాగుకు యంత్ర పరికరాలు అవసరం అవుతున్నాయి.

### యంత్రాల అవసరం ఎక్కువే..

జిల్లాలో వ్యవసాయ యంత్ర పరికరాల అవసరం ఎక్కువగానే ఉంటుంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో అన్ని మండలాల్లోనూ వరి, మొక్కజొన్న, సోయా, పత్తి, శనగ, చెరుకు, కంది లాంటి పంటలను వేల ఎకరాల్లోనే సాగవుతున్నాయి. నాట్లతో పాటు కోతలకు యంత్రాలను రైతులు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా వరి కోతలను ఎక్కువగా హార్వేస్టర్‌ల ద్వారానే కోతలు చేపడుతున్నారు. ఈ యంత్రాలకు ప్రతీ సీజన్‌లో డిమాండ్ నెలకొంటుంది. అదేవిధంగా మొక్కజొన్న ఒలిచేందుకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. సోయా శుద్ధి చేసేందుకు యంత్రాలు వాడుతున్నారు. ఇలా ప్రతీ పంటకు యంత్రాలతోనే సాగు చేస్తున్నారు. గడ్డి కట్టేందుకు యంత్రాలవల్ల పశుగ్రాసం వృథా కాకుండా ఉంటుంది.

### ఎక్కువ ధరలు చెల్లించి కొనుగోళ్లు

జిల్లాలో ప్రతీ గ్రామంలో దాదాపు 5 నుంచి 10 ట్రాక్టర్లు ఉంటున్నాయి. సాగు పనులకు వీటినే వాడుతున్నారు. ప్రభుత్వం సుమారు ఐదేళ్ల నుంచి రాయితీని నిలిపివేశాక ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలా మంది రైతుల వద్ద పరికరాలు ఉన్నాయి. ముఖ్యంగా దమ్ము చక్రాలు, మందు పిచికారీ చేసే స్ప్రేలు, రోటవేటర్‌లు, హార్వేస్టర్‌లు, గడ్డి మోపులు కట్టే యంత్రాలు ఉన్నాయి. రాయితీపై లభిస్తే చాలా మంది కొనుగోలు చేసే అవకాశం ఉంది. వ్యవసాయ యంత్రాల పరికరాల ఉపయోగాలపై అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. మొదట వ్యవసాయ పరికరాలు, యంత్రాలతో జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నారు. వీటిలో పరికరాల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు, నిపుణులు పాల్గొని వాటి ఉపయోగం, పనిచేసే విధానం, ధరలు రాయితీ అంశాలపై వివరించనున్నారు. అదేసమయంలో అవసరమున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకుని అర్హులకు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు.

- సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీకి ప్రభుత్వం యోచన
- యాంత్రీకరణ పథకాన్ని సర్కార్ పునరుద్ధరించాలని నిర్ణయం
- పథకానికి నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ప్రభుత్వ ప్రకటనతో అన్నదాతల్లో సంతోషం
- జిల్లాలో 2.99 లక్షల మంది రైతులు

### గత 5 సంవత్సరాలుగా నిలిచిన సబ్సిడీ యంత్రాల పంపిణీ

రాష్ట్రప్రభుత్వం రైతులకు వ్యవసాయ సాగు కోసం రాయితీపై యంత్రాలను అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందుకోసం యాంత్రికరణ పథకాన్ని అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. అయితే పథకం కింద ఏఏ యంత్రాలు సబ్సిడీపై ఇవ్వనున్నారనే వివరాలు వెల్లడించారు. హార్వేస్టర్‌లు, రోటవేటర్‌లు, స్ప్రేయర్‌లు, మొక్కజొన్న ఒలిచే యంత్రాలు, పత్తితీత, గడ్డి కత్తిరింపు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్‌లు తదితర యంత్రాలను అందించే అవకాశం ఉంది. గతంలో ట్రాక్టర్‌లు ఇతర వ్యవసాయ యంత్ర సామగ్రి అందించారు. ముఖ్యంగా రోటవేటర్ మూడు కాళ్ల నాగళ్లు, కేజీవీల్, మందు పిచికారీ చేసే స్ప్రేలు 50 శాతం రాయితీపై అందుబాటులో ఉండేవి. రైతులు వీటిని కొనుగోలు చేసి సేద్యం చేసే వారు. ప్రతీ వ్యవసాయ కార్యాలయం వద్ద అవి ఎప్పుడు సిద్ధంగా ఉండేవి. అయితే గత 5సంవత్సరాలుగా వ్యవసాయానికి యాంత్రికరణ సబ్సిడీపై అందించే పథకాన్ని నిలిపివేశారు. ఇప్పుడు తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



వ్యాపారులకు దుకాణ పత్రాలు అందిస్తున్న షబ్బీర్‌అలీ

## ప్రతీ అర్హుడికి ప్రభుత్వ పథకాలు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం అర్హులైన ప్రతీ ఒక్కరికి అందుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మటన్ మార్కెట్‌లో వ్యాపారులకు కేటాయించిన దుకాణాలను వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన మటన్ దుకాణాలు నేటి వరకు కేటాయించలేదని ప్రస్తుతం నా చేతుల మీదుగానే దుకాణాల కేటాయింపు పత్రాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. వ్యాపారుల ప్రతీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఈ నెల 26న రేషన్‌కార్డులు, రైతుభరోసాలను అందిస్తుందని తెలిపారు. వ్యవసాయయోగ్యమైన భూములకే రైతుభరోసా అందేలా చూడాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాలను 10 రోజుల్లో అధికారులు నివృత్తి చేస్తారని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తున్న వేళ రేషన్‌కార్డులు తొలగిస్తారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేవి నిరంతర ప్రక్రియ అని తెలిపారు. రైతులకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం 49వ వార్డులో వార్డుసభను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కమిషనర్ స్పందన, కౌన్సిలర్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాలి



షబ్బీర్‌అలీకి వినతి పత్రం అందిస్తున్న గ్రామస్థులు

రాజంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని రాజంపేట గ్రామప్రజలు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1993లో సర్వే నెంబర్ 630లో రెండు ఎకరాల భూమిని రాజంపేట గ్రామం నుంచి విరాళం రూపంలో జుక్కంటి మోహన్‌రెడ్డి, పది మంది కలిసి తీసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఎంహెచ్‌వో నిజామాబాద్ పేరున రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. ఈ స్థలంలో పీహెచ్‌సీని నిర్మించగా మిగిలిన 12 గుంటల స్థలంను చందపు సత్యనారాయణరెడ్డి పేరున డాక్యుమెంట్ సృష్టించారని తెలిపారు. గ్రామస్థులు అడిగితే తిరిగి కేసులు పెట్టిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 576, 569లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి వారి కుటుంబసభ్యుల పేర్లు మార్చుకొని వాటిపైన పాసుపుస్తకాలు తీసుకుని రుణమాఫీ కూడా పొందుతున్నాడని తెలిపారు.

### ఫటా..ఫట్...

జిల్లా గ్రంథాలయాలను

## రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

- గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి



భిక్కనూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రంథాలయాన్ని నూతన హంగులతో, అన్ని సౌకర్యాలను కల్పించి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**చైర్మన్:** జిల్లాలోని గ్రంథాలయాలు గత చాలా సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో చాలా అధ్వానంగా తయారయ్యాయి. చాలా గ్రంథాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. నేను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న గ్రంథాలయాలను సందర్శించి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కృషితో ప్రతీ గ్రంథాలయంలో ఎలాంటి సమస్యలున్నా ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుంది.

**ఆంధ్రజ్యోతి:** గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న వారికి, విద్యార్థులకు అవసరమైనా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా?

**చైర్మన్:** జిల్లాలోని ప్రతీ గ్రంథాలయాన్ని సందర్శించిన సమయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో, విద్యార్థులతో మాట్లాడి వారికి అవసరమైనా, వారు సూచించిన పుస్తకాలను నిధులు లేకున్నా నా సొంత డబ్బులతో పాటు నా స్నేహితులు, దాతల సహకారంతో కొనుగోలు చేసి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నాం.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలోని గ్రంథాలయాలన్నింటికి సొంత భవనాలు ఉన్నాయా?

**చైర్మన్:** జిల్లాలోని పాత ఐదు మండలాల్లో (మాచారెడ్డి, బీర్కూర్, నాగిరెడ్డిపేట, గాంధారి, పెద్దకొడప్‌గల్) సొంత భవనాలు లేవు. వాటితో పాటుగా కొత్త మండలాల్లో నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తాం.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలోని గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయాలకు ఎన్ని బకాయిలు రావాల్సి ఉంది?

**చైర్మన్:** జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి మాకు సుమారు రూ.2.75కోట్ల సెస్ అమౌంట్ రావాల్సి ఉంది. దీనిపై ఇప్పటికే అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో దృష్టికి తీసుకెళ్లాం.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో ఎక్కడెక్కడా గ్రంథాలయాల్లో వైఫై సౌకర్యం ఉంది?

**చైర్మన్:** జిల్లాలోని కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రతీ గ్రంథాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్ సహకారంతో వైఫై సౌకర్యం ఏర్పాటు చేశాం. జిల్లాలోని ప్రతీ గ్రంథాలయంలో వైఫై సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. తన నిధులతో పాటుగా నా స్నేహితుల, దాతల సహకారం తీసుకుంటున్నాం.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలోని గ్రంథాలయాల్లో సిబ్బంది సమస్య ఉందా?

**చైర్మన్:** జిల్లాలో సిబ్బంది సమస్య చాలా ఉంది. జిల్లాలో కేవలం ఐదుగురు మాత్రమే పర్మినెంట్ సిబ్బంది, నలుగురు ఔట్ సోర్సింగ్, 8 మంది పార్ట్‌టైం సిబ్బంది ఉన్నారు. సిబ్బంది సమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుంది.

## ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

పెద్ద కొడప్‌గల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందుబాటులోకి ఆరోగ్య సేవలు తీసుకవచ్చామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో 16 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పథకంలో 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. దీంతో పాటుగానే ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతను తీర్చేందుకు గాను నూతనంగా సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. అంతేగాక ఆసుపత్రుల్లో సేవలు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇక మారుమూల గ్రామాలకు అత్యవసరంగా ఆరోగ్యసేవలు అందించేందుకు గాను నూతనంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అంతేగాక రానున్న రోజుల్లో ప్రజలకు అవసరమైన పథకాలను గుర్తించిన తమ ప్రభుత్వం వాటి అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న గ్రామ సభల్లో 4 పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కొన్ని గ్రామాల్లో రేషన్ కార్డులు రాలేదని ప్రజలు ఆందోళన చేస్తున్నారని, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అవసరం ఉన్న వారు ఎప్పుడైనా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. వీటితో పాటుగా రానున్న రోజుల్లో ప్రజలకు అవసరమైన పనులు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట



దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

## బిచ్కుందలో దివ్యాంగుల శిబిరం

బిచ్కుంద, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు వేదికలో వికలాంగుల ఉపకరణముల ఎంపిక శిబిరం అలీమ్‌కో, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ రకాల వైకల్యం గల 493 వికలాంగులు హాజరై పేరు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. శిబిరం నందు ఎంపిక చేయబడిన వికలాంగులకు అలీంకో కంపెనీ ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉచితంగా ఉపకరణాల పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, మద్నూర్ సీడీపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

## 'డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయండి'

బీర్కూర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి ): బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయం ఎదుట రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయించాలని గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాలయం ఎదుట రోడ్డుకిరువైపులా డ్రైనేజీ నిర్మించకుండా వదిలేశారన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులున్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## బడి బయట పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్‌పీలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను సీఆర్‌పీలు బడిలో చేర్పించారు. మండలానికి చెందిన సీఆర్‌పీలు భీమన్న, భీంరావ్‌లు ఆయా గ్రామాల్లో తిరుగుతూ బడి మానేసి పనులు చేసుకుంటున్న వారిని గుర్తించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుంచి వివిధ గ్రామాలకు చెందిన సుమారు 15మంది పిల్లలను బడిలో చేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దగుల్ల తండా ప్రధానోపాధ్యాయురాలు అరుణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉద్యోగాలను అందించడం గొప్ప విషయం



మాట్లాడుతున్న తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ డీన్ అండ్ ప్రిన్సిపాల్ ఆర్తి

- తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ డీన్ అండ్ ప్రిన్సిపాల్ ఆర్తి

కామారెడ్డి టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్‌కే గ్రూప్ కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీలు విప్రో, జెన్పాక్ట్, టెక్ మహింద్రా, క్యామెల్ క్యూ లాంటి ఐటీ కంపెనీలు, ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ డీన్ అండ్ ప్రిన్సిపాల్ ఆర్తి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాంలు హాజరై మాట్లాడారు. క్యాలిటీ ఎడ్యుకేషన్‌తో పాటు విద్యార్థులకు ఉద్యోగాలు అందించడం గొప్ప విషయమని తెలిపారు. చదువుతో పాటు ఉపాధి చూయిస్తే ఆ కళాశాల పేరును ఎల్లప్పుడు గుర్తించుకుంటారని తెలిపారు. విద్యార్థులు వచ్చే ఇంటర్, డిగ్రీ, పీజీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామక పత్రాలు అందిస్తామని ఆయా కంపెనీల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే గ్రూప్ కళాశాలల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాళ్ల సైదయ్య, దత్తాత్రి, నవీన్, గోవర్ధన్, గంగాధర్, ప్లేస్మెంట్ ఆఫీసర్ బాలు మహేంద్ర, వైస్ ప్రిన్సిపాళ్లు ప్రభాకర్, రవి, శ్రీధర్, శ్రీవాణి, శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.



మాధవపల్లి గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

అర్హులైన నిరుపేదలకు

## ప్రతీ పథకం అందుతుంది

- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

గాంధారి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం గాంధారి మండలం మాధవపల్లి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు ఈనెల 26 నుంచి అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించడం జరుగుతుందని తెలిపారు. భూములు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించడం జరుగుతుందని, ఉపాధి జాబ్‌కార్డు కలిగి, 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు పనులు చేసి ఉండాలని తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం గత ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్నవారికి, కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవడం కోసం, గతంలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుత గ్రామసభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇళ్ల స్థలాలు ఉండి పక్కా ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామసభ ఆమోదం మేరకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నాలుగు పథకాల్లో అర్హులైన ముసాయిదా జాబితాలను గ్రామసభలో చదివి వినిపించారు. వాటిపై ఏమైన ఆక్షేపణలు ఉంటే తెలియజేయాలని అన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, నీటి ట్యాంక్ ఉన్నప్పటికీ గ్రామంలోని పైప్‌లైన్ సరిగా లేదని తెలిపారు. స్వయం సహాయక బృందానికి సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవనం మంజూరు కావాలని కలెక్టర్‌ను కోరారు. గ్రామంలోని నిరుపేదలు అర్హత కలిగిన వృద్ధులకు పింఛన్‌లు మంజూరు చేయాలని తెలిపారు. ఈ గ్రామసభలో తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీప్రసన్న, వ్యవసాయ విస్తరణాధికారి సూర్యప్రకాష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

## లిస్టులో పేర్లు లేనివారు
## ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి

● దోమకొండ మండల ప్రత్యేకాధికారి జ్యోతి



ప్రభుత్వ పథకాలలో ప్రస్తుతం లిస్టులో పేర్లు రాని అర్హులు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో తమ దరఖాస్తులను సంబంధిత పత్రాలు, పూర్తి వివరాలతో జతచేసి అందజేయాలని దోమకొండ మండల ప్రత్యేక అధికారి జ్యోతి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరిన్ని వివరాలు వెల్లడించారిలా...

**ఆంధ్రజ్యోతి:** ప్రభుత్వ పథాకాలకు సంబంధించి గ్రామ సభలు ఎలా కొనసాగుతున్నాయి?

**స్పెషల్ ఆఫీసర్:** దోమకొండ మండలంలోని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు పథకాలపై గ్రామ సభలు నడుస్తున్నాయి.

**ఆంధ్రజ్యోతి:** గ్రామసభలు అన్ని గ్రామాల్లో పూర్తి అయ్యాయి?

**స్పెషల్ ఆఫీసర్:** మండలంలోని 8 గ్రామాల్లో సభలు పూర్తి అయ్యాయి.21 నుంచి మొదలై 24 వరకు కొనసాగుతున్నాయి. 24 న చివరి గ్రామ సభ దోమకొండతో పూర్తి అవుతుంది.

**ఆంధ్రజ్యోతి:** పథకాలకు సంబంధించి పేర్లు రాని వారి పరిస్థితి ఏంటి?

**స్పెషల్ ఆఫీసర్:** ప్రజలు తమ పేరు రాలేదని ఎలాంటి ఆందోళన చెందవద్దు.ఎంపీడీవో కార్యాలయంలో కౌంటర్ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవాలి.

**ఆంధ్రజ్యోతి:** గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాలపై గొడవలు, అధికారుల నిలదీత సంఘటనలు జరుగుతున్నాయా?

**స్పెషల్ ఆఫీసర్:** ఎక్కడ ఎలాంటి గొడవలు జరగలేవు. కొన్ని గ్రామాల్లో అర్హులైన వారు తమ పేర్లు ఎందుకు మిస్సయ్యాయని అడుగుతున్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గ్రామ ప్రత్యేక అధికారులు వారిని సముదాయించి అర్థం అయ్యో విధంగా తెలియజేస్తున్నారు.

**ఆంధ్రజ్యోతి:** అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులైన నాలుగు ప్రభుత్వ పథాకాలకు సంబంధించి ఎన్ని ఉండవచ్చు?

**స్పెషల్ ఆఫీసర్:** మండలంలో మొత్తం సర్వే నివేదికను తయారు చేశాం.గ్రామాల్లో ఒక్కోక్క పథకానికి సంబంధించి అర్హులైన లబ్ధిదారుల లిస్టు కార్యదర్శుల వద్ద జీపీల్లో ఉంచడం జరిగింది. గ్రామ సభలు పూర్తి కాగానే మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి మొత్తం లబ్ధిదారుల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.ప్రస్తుతం లిస్టులో పేర్లు రాని వారి దరఖాస్తులు వస్తున్నాయి. అన్నింటిని అన్‌లైన్ చేసి పూర్తి నివేదికను అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుంది.

● (ఆంధ్రజ్యోతి,దోమకొండ)

## శిక్షణ తరగతులకు పేర్ల నమోదు

ఆర్మూర్‌టౌన్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పైడి రాకేశ్‌రెడ్డి సహకారంతో హైదరాబాద్ న్యాక్ బృందం ఆధ్వర్యంలో గల్ఫ్‌లో ఉపాధి పొందాలనుకున్న వారికి శిక్షణ తరగతుల నిర్వహణకు గురువారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్వర్ మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నాణ్యమైన శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు. దీని ద్వారా విదేశాలలో ఉపాధి పొందడానికి సులభతరం అవుతుందని, శిక్షణ కాలంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. గల్ఫ్ ఏజెంట్‌లను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. ఇటీవల శిక్షణ పొందిన వారికి గ్రీస్ దేశంలో ఉపాధి నిమిత్తం ఈనెల 25న నిజామాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ప్రజాసేవలో ముందుండాలి: మలక్‌పేట ఎమ్మెల్యే




బోధన్‌లో మాట్లాడుతున్న మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):బోధన్‌లో ఎంఐఎం పార్టీని బలోపేతం చేస్తూ ప్రజాసేవలో ముందుండాలని హైదరాబాద్ మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అయేషా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో 10వ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు సమీ, హబీబ్ ఖాన్, జియా అహ్మద్, చాలం చావుస్, హైమద్ చావుస్, రజా, ఆదిల్, ఏజాజ్‌లతో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నవీపేట:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం టెన్త్ విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ క్వశ్చన్ బ్యాంక్ పుస్తకాలను హైదరాబాద్‌లోని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షులు ఫారూఖ్ హైమద్, నిజామాబాద్ డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, ఎంఐఎం మండల అధ్యక్షులు అర్షద్ ఖురేషి, అబ్దుల్ ఖదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులున్నారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి



కోటగిరిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సీజీఆర్) ప్రోగ్రాం ఇన్‌చార్జి నగేష్ పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సిజీఆర్ ఆధ్వర్యంలో యంగ్ లీడర్స్ ఎర్త్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రావు, జిల్లా ఇంచార్జ్ శంకరయ్య, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బర్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** పర్యావరణాన్ని కాపాడడంతో విద్యార్థులు భాగస్వాములు కావాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రోగ్రామ్ అధికారి పాలడుగు నాగేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలచంద్రం, ఉపాధ్యాయులు విద్యాసాగర్, రాకేష్, ఉపాధ్యాయ బృందంలతో పాటు మామిడి శంకరయ్య, పాల్గొన్నారు.

## డయల్ 100కు అత్యవసరమైతేనే ఫోన్ చేయాలి

బోధన్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి: డయల్ 100కు అత్యవసరం అయితేనే ఫోన్ చేయాలని,అకారణంగా ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేయవద్దని పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. బోధన్ పట్టణంలోని గోశాలకు చెందిన షేక్ ఫారూక్ అనే వ్యక్తి మద్యంతాగి పలుమార్లు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృథా చేసినందుకు గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించారని ఆయన తెలిపారు.

# పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు సంక్షేమ పథకాలు

● రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



అడ్కాస్‌పల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం



జాన్కంపేట్ గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం



కోనాపూర్ గ్రామసభలో పాల్గొన్న మానాల మోహన్ రెడ్డి, అధికారులు

కోటగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, రైతు భరోసా సాగుకు యోగ్యమైన ప్రతి భూమికి అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి, పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామాలలో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజుతో కలిసి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. రైతు భరోసా సాగుకు యోగ్యమైన భూములకు అందించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. జిల్లాలో ఐదున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, పలు నిబంధనల మేరకు 12 వేల ఎకరాల భూమికి మాత్రమే రైతు భరోసా అందించడం లేదన్నారు. రైతు భరోసా ఎకరానికి 6000 చొప్పున సంవత్సరానికి 12 వేల రూపాయలు రైతుల ఖాతాలో జమవుతుందన్నారు. పెట్టుబడి సాయంతో పాటు బోనస్ కల్పించడంతో వ్యవసాయం పండగలాగా సాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారికి 5 లక్షల రూపాయలు ఎలాంటి కటింగులు లేకుండా మొత్తం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ హన్మంతు, మాజీ జడ్పీటీసి శంకర్ పటేల్, నాయకులు కొట్టం మనోహర్, సిరాజ్, బర్ల మధు, శ్రీధర్, కృష్ణారెడ్డి, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారులు రాజు, నిషిత, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**మోస్రా:** మోస్రా మండల కేంద్రంలో, చందూర్ మండల కేంద్రంలో గురువారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించగా మోస్రాలో రేషన్ పరేషాన్ కాగా చందూర్ మండల కేంద్రంలో గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుగా చేశారని, ఇళ్లు ఉన్న వారికి డబుల్ ఫ్లోర్ ఇళ్లు ఉన్న వారికి సైతం ఇళ్లు మంజూరు అయింది. కాని మా లాంటి ఇళ్లు లేని వారికి మంజూరు కాలేదని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించగా అధికారులు అంతా గప్ చుప్‌గా ఉన్నారు. స్థానిక నాయకులు గ్రామస్థులను ఓపికగా ఉండాలని కోరుతూ వారు అధికారులను ప్రశ్నించారు. అదే విధంగా ఓ గ్రామ పెద్ద మాట్లాడుతూ నేను స్వయంగా రాసి ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తులో కూడా అర్హులైన వారిని అనర్హులుగా చూపించారు. ఇంతటి నిర్లక్ష్యం తగదని అన్నారు. ఉపాధి హామీ కూలీ డబ్బులు సైతం కొందరికీ రాలేదని ఆరోపణ చేశారు. అదే విధంగా చందూర్ మండలంలోని మేడిపల్లితండాలో తహసీల్దార్ శాంత ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించగా ఎలాంటి ఆరోపణలు ఏర్పడలేదు. ఈ కార్యక్రమంలో చందూర్ మండల అధికారి విజయ్ కుమార్, తహసీల్దార్ శాంత, ఎంపీడీఓ నీలావతి, మోస్రా మండల ప్రత్యేక అధికారి రమేష్ రాథోడ్, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ సురేష్, ఆయామండలాల కార్యాలయాల సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు,గ్రామస్థులు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

**నవీపేట:** మండలంలోని పలు గ్రామాలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. నవీపేట, రాంపూర్, పోతంగల్, నందిగాం, నిజాంపూర్, నాడాపూర్, సిరన్‌పల్లి, శివతండా, యంచ, తుంగిని గ్రామాలలో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల జాబితాలలో అర్హులైన వారి పేర్లు లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలువురు అధికారులను నిలదీశారు. నవీపేటలో జరిగిన గ్రామసభలో అనర్హులకు రేషన్ కార్డులు ఎలా మంజూరయ్యాయని పలువురు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఏవో నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

**ఏర్గట్ల:** మండలంలోని దోంచంద, తొర్తి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాల్లకై ఏర్పాటు చేసిన గ్రామ సభలు నిర్వహించారు. అందులో భాగంగా తొర్తి గ్రామంలో గురువారం జరిగిన గ్రామ సభ రసాభాసగా మారింది. గ్రామంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను అధికారులను గ్రామ సభలో తెలుపగా అనర్హుల పేర్లు రావడం, అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించిన కేవలం 81 మందికి మాత్రమే ఎలా వర్తిస్తుందని, మిగతా ఉపాధి కూలీల పేర్లు ఎందుకు రాలేదని స్థానికుల తరపున మాజీ సర్పంచ్‌నవీన్ అధికారును ప్రశ్నించడంతో ఆందోళన జరగ్గా ఏర్గట్ల ఎస్సై రాము రంగంలోకి దిగిగొడవను సర్దిమనిగించారు. ఈ కార్యక్ర మంలో ఎంపివో శివచరణ్,ఆరై సదానంద్, ఏవో వైష్ణవ్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఇది నిరంతర ప్రక్రియ అని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని 25 తదితర వార్డులలో ప్రజాపాలన వార్డుసభల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వార్డు సభలలో పేర్లు రాని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డీఈ విఘ్నేష్‌లతో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**సాలూర:** బోధన్ మండలంలోని హున్స, మావందిఖుర్దు,పెంటాకలాన్, నాగన్‌పల్లి, భవానీపేట్ తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా రేషన్‌కార్డులు రాని వారు తమ పేర్లు నమోదు చేయాలని కోరారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో బాల గంగాధర్ తెలిపారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఆర్మూర్‌టౌన్:** మున్సిపల్ పరిధిలో జరుగుతున్న వార్డుసభలను గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని 6, 10, 14, 15, 21, 25, 27, 28, 34, 35 వార్డులలో వార్డుసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు కొంతం మురళీ, బదం రాజ్‌కుమార్, ఇంతియాజ్, అతిక్, సత్యనారాయణ, భూపేందర్, రవీందర్‌రెడ్డి, విజయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** అర్హులైన నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని లబ్ధిదారుల జాబితాలో పేర్లు రానివారు అధైర్యపడకుండా తిరిగి దరకాస్తులు చేసుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ ఎం ఆంజనేయులు, ఆర్ఐ శరత్, నాయకులు చిన్నోల్ల రెడ్డి,జలంధర్, గడ్డం అశోక్, లక్ష్మీ, హన్మాండ్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆర్మూర్‌రూరల్:** జిల్లా పరిషత్ సీఈవోగా పదవీ బాధ్యతలు చేప ట్టిన సాయన్నను గురువారం ఆలూర్ గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. తమ గ్రామానికి చెందిన అధికారి సాయన్న జడ్పీసీఈ వోగా బాధ్యతలు చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ కల్లెం మోహన్‌రెడ్డి, మాజీఎంపీటీసీ మార్కంటి మల్లేష్, మాజీఉపసర్పంచ్ దుమ్మజి శ్రీనివాస్, ముత్యం పాల్గొన్నారు.

**వేల్పూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు నిర్వహణలో భాగంగా శుక్రవారం మండలంలోని జాన్కంపేట్, వాడి గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. జాన్కంపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల వంటి పథకాలకు మంజూరుకు సంబంధించి జాబితాను లబ్ధిదారులు చదివి వినిపించారు. దీంతో ఆయా పథకాలలో నిజమైన అర్హులైన వారికి కాకుండా అనార్హుల పేర్లు జాబితాలో ఉండడం పట్ల గ్రామ ప్రజలతో పాటు బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీయడంతో గ్రామసభ రసభసగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళ పథకాలలో మంజూరైన జాబితాలో అనార్హుల పేర్లు ఉండడం పట్ల ప్రజలు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి భారతి, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీవో సాయిలు, డీటీ మధు, ఏపీవో అశోక్, ఏఈవో స్నేహశ్రీ, గ్రామస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**భీమ్‌గల్/భీమ్‌గల్‌రూరల్:** మండలంలోని పురాణిపేట్ గ్రామంలో గురువారం గ్రామసభలో గందరగోళం ఏర్పడింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇంది రమ్మ రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ళ జాబితా, రేషన్‌కార్డుడల జాబితాలో అర్హుకు కాకుండా అనర్హులకు పథకాలు ఇస్తున్నారని అధికారులను నిలదీసి రచ్చరచ్చ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఎంత సముదాయించిన వినకుండా అర్హత ఉండి జాబితాలో పేరు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించిన కొంత మంది వెనుదిరిగారు. జగిర్యాల్, కుప్కాల్, సుదర్శన్‌నగర్‌తాండా, రహత్‌నగర్‌తాండా, కొత్తతాండా, బాబాపూర్, బాబానగర్ గ్రామాల్లో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, ఎంపీవో జావిద్‌అలీ, డీప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ, కాంగ్రెష్ మండల, పట్టణ అధ్యక్షుడు స్వామి, నర్సయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు అనంత్‌రావు, నాయకులు కన్నె సురేందర్, వాక మహేష్, కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

**ముప్కాల్:** ముప్కాల్, బాల్కొండ మండలాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంకు దారి తీసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలలో అర్హులకు కాకుండా అనార్హుల పేర్లు రావడం పట్ల అధికారులు సర్వేలో ఇచ్చారని ప్రజలు ఆరోపించారు.ఈ సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ప్రజలు శాంతించారు.

**జక్రాన్‌పల్లి:** సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అరులైన ప్రజలందరికీ అందజేస్తామని మాజీఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లి మండలంలోని జక్రాన్‌పల్లి, మనోహరాబాద్, తొర్లికొండ, బ్రహ్మణ్‌పల్లి, మునిపల్లి గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. మునిపల్లిలో జరిగిన గ్రామసభలో ఎం.సాయిరెడ్డి హాజరై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ పథకాలను అర్హులైన వారందరికి సద్వినియోగం చేసుకోవాలన్నారు.జక్రాన్‌పల్లిలో జరిగిన గ్రామసభలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, గ్రామసభకు హాజరయ్యారు. అనంతరం జరిగిన గ్రామసభలో ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదప్రజల కోసం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను అర్హులైన వారందరికి ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఈ గ్రామసభలో మాజీసర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మండల ప్రత్యేక అధికారి ప్రవీన్, ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండలంలోని దొన్‌పాల్, శెట్‌పల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు.దొన్‌పాల్‌లో ఎంపీవో శ్రీధర్, జీపీ అధికారులు పాల్గొనగా శెట్‌పల్లిలో ఎంపీడీవో తిరుమల, ఇతర మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రామసభ సజావుగా జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీఎంపీటీసీ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రసభసచేయాలని చూడడంతో గ్రామానికి చెందిన యువకులు ఆయనపై తిరగబడ్డారు.పదేళ్లపాలనలో ఒకరేషన్‌కార్డు,ఇళ్లుఇవ్వలేదని,ఏముఖంపెట్టుకొని అడుగుతున్నావని నిలదీశారు.

## ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



వర్నిలో నివాళులు అర్పిస్తున్న ఆటో యూనియన్ నాయకులు

వర్ని,జనవరి23(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో గురువారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల కృష్ణ, సుబ్రమణ్య స్వామి, ప్రవీణ్, రవి, మారుతి, సునీల్, గంగారాం, కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** ఆజాద్‌హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు దేశస్వాతంత్రంకోసం పోరాడిన మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను బషీరాబాద్‌లో నవోదయ యూత్ సభ్యులు గురువారం ఘనంగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. కా ర్యక్రమంలో నవోదయ యూత్ అధ్యక్షుడు ఆకుల నారాయణ, సభ్యులు నేల్ల రమేష్, కుమ్మరి శ్రీనివాస్, స్వర్గం రమేష్, బాషెట్టి గంగాధర్, శ్రీనివాస్, గణేష్, నేల్ల బుచ్చన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, గిరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవన్న, గుండోజి రవిందర్, సల్లూరి కిషన్ గౌడ్, రంగాచారి, శ్రీనివాస్ గౌడ్, మహికాంత్, సుమలత, శిరీష, పద్మ,విద్యార్థులు పాల్గొన్నారు.

**నవీపేట:** మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం సభ్యులు సందీప్, సునీల్, గణేష్, ప్రవీణ్, శరత్ తదితరులున్నారు.

**ముప్కాల్:** ముప్కాల్ మండల కేంద్రంలోని సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సుబాస్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సామ వెంకట్‌రెడ్డి, నాయకుడు సంతోష్, బద్దం నర్సారెడ్డి, గంగాధర్, మోహీనోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు.ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయిఅబాకస్ పోటీలలో పాఠశాల విద్యార్థులు భూమేష్ చంద్ర,ఆస్పియా,అశ్విని,మిథున్‌రాజ్,రిషిక,సంహిత,శ్రీహన్,దీరాజ్‌లుఅత్యుత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు కరస్పాండెంట్ పొలపల్లి సుందర్ తెలిపారు.

**డొంకేశ్వర్:** అబాకస్ నేర్చుకోవడంతో పిల్లలకు జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఎస్ఎస్‌వీ పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి అన్నారు. డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో ఎస్ఎస్‌వి పాఠశాల విద్యార్థి మేకల దీక్షిత నిజామాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ఆయన తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందజేశారు. పాఠశాల నుంచి మొదటిసారిగా రాష్ట్రస్థాయికి విద్యార్థి ఎంపిక కావడంతో స్వామి, నరేష్, మౌనిక, ఉపాధ్యాయులను కరస్పాండెంట్ చిరంజీవి అభినందించారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి తరలిస్తున్న వారిని రిమాండ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆర్మూర్‌రూరల్,జనవరి23(ఆంధ్రజ్యోతి):గంజాయినివిక్రయిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్టు చేసినట్టు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐస్టీవెన్‌సన్ తెలిపారు.సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఇలాఉన్నాయి.ఎక్సైజ్ పోలీసులు రూట్ వాచ్‌మెన్ నిర్వహిస్తున్న క్రమంలో అంకాపూర్ నిజాంసాగర్ కెనాల్‌బ్రిడ్జి సమీపంలో అదే గ్రామానికి చెందిన నూనే శ్రీకాంత్, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన కిరణ్ ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. వీరు ఎండు గంజాయిని అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి ఆర్మూర్ ప్రాంతంలోని చుట్టు పక్కల గ్రామాల్లో చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారన్నారు. వీరిను ంచి 1. 6కిలోల ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై చంద్ర మౌళి, ఎక్సైజ్ సిబ్బంది గంగాధర్‌గౌడ్, మోహన్, దేవిదాస్, వికాస్‌గౌడ్, సా యిలు, నరేష్, సందీప్, శ్రీనివాస్, సాగర్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

## నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాక్లూర్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాస్‌నగర్ గ్రామం వద్ద గంజాయి విక్రయిస్తున్న శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నిందితుడు నవీపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన వాడు కాగా, గత కొద్ది రోజులుగా నాందేడ్ నుంచి గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నారు. గురువారం దాస్‌నగర్ వద్ద అనుమానస్పదంగా పరుగెత్తడంతో అతనిని పట్టుకొని విచారించగా 110గ్రాముల గంజాయి లభించగా దాన్ని సీజ్ చేసి శ్రీకాంత్‌ను అరెస్టు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## 'రాజకీయ లబ్ధికోసమే బీఆర్ఎస్ నాయకుల తాపత్రయం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్,జనవరి23(ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికి పథకాలు అందజేయాలన్న ఉద్దేశంతో గ్రామసభలు నిర్వహిస్తుండగా స్థానిక ఎన్నికల్లో రాజకీయ పొంద డానికి బీఆర్ఎస్ నాయకులు తాపత్రయ పడుతున్నారని స్థానిక కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. గురువారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో జరిగిన ప్రశాంతంగా జరుగుతున్న గ్రామసభలో బీఆర్ఎస్ నాయ కులు కావాలని అధికారులను నిలదీయడం సరైందికాదన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల ఎంపికలో అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయడం జరిగిందని వారన్నారు. రాబోయే స్థానిక ఎన్ని కల్లో లబ్ధిపొందడం కోసమే బీఆర్ఎస్ నాయకులు అర్థరహితంగా ప్రవర్తిం చారని వారు ఆరోపించారు. ఈ సందర్భంలో అధికారుల పథకాల కొనసాగిం పు ప్రక్రియ అని చెబుతూ గ్రామసభను సజావుగా నిర్వహించార న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదేపల్లి జెమ్స్, కుంటకింది శ్రీనివాస్, వినోద్, రంగు శేఖర్‌గౌడ్, గాంధీ, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

● ఇద్దరు విద్యార్థులకు గాయాలు ● తప్పిన పెను ప్రమాదం



కమలాపూర్ సమీపంలో బోల్తాపడిన ప్రైవేటు పాఠశాల బస్సు

నవీపేట,జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్ సమీపంలో గురువారం ఉదయం ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు బోల్తా పడింది. మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు మండలంలోని నాడాపూర్‌లో 30మంది విద్యార్థులను ఎక్కించుకుని నవీపేటకు వస్తుంది. కమలాపూర్ సమీపంలో పాఠశాల బస్సు అదుపు తప్పి ఎడమ వైపున పొలాల్లోకి తీసుకెళ్లి బోల్తా పడింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయాందోళనతో కేకలు వేస్తూ ఏడ్చారు. దీంతో సమీపంలో ఉన్న పలువురు స్థానికులు బోల్తాపడి ఉన్న బస్సులోని విద్యార్థులను బయటకు తీశారు. ఇందులో నాడాపూర్‌కు చెందిన మావురం మీనాక్షి అనే 4వ తరగతి విద్యార్థిని, గైని నామన్వి అనే యుకేజీ విద్యార్థినికి గాయాలు కాగా వారికి నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బస్సుప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్‌కు బదులుగా క్లీనర్ భోజన్న బస్సును నడిపినట్లు విద్యార్థులు పేర్కొన్నారు. దీనికి తోడు ప్రమాదం జరిగిన స్థలంలో కొందరు రోడ్డుకు ఇరువైపులా కబ్జా చేసి తమ పొలంలో కలుపుకోవడంతో ఇరుకుగా మారిందని పలువురు ఆరోపించారు. ఆక్రమణకు గురైన రోడ్డును వెంటనే స్వాధీనం చేసుకుని రోడ్డును వెడల్పు చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, మోటార్ వెహికిల్ ఇన్స్‌స్పెక్టర్, ఏఎస్ఐ మోహన్ రెడ్డి, ఎంఈవోలు సందర్శించారు.

### క్లీనర్‌పై కేసు నమోదు

నవీపేట,జనవరి23(ఆంధ్రజ్యోతి):మండలంలోని కమలాపూర్ సమీపంలో గురువారం ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా పడిన ఘటనలో బస్సు నడిపిన క్లీనర్ శివరాశి పెద్ద భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. నాడాపూర్‌లో విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని నవీపేటకు వస్తుండగా బస్సును డ్రైవర్ శివరాశి భోజన్నకు బదులుగా క్లీనర్ శివరాశి పెద్దభోజన్న నడపడంతో బస్సు పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిందని అన్నారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు కాగా అదే బస్సులో ప్రయాణిస్తున్న ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు ఉజ్వల ఫిర్యాదు మేరకు క్లీనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

## డెంగీ కేసులపై ఆరా తీసిన వైద్య బృందం

భీమ్‌గల్‌రూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగల్ గ్రామంలో భారతీయ వైద్య బృందం గురువారం పర్యటించింది. చేంగల్ గ్రామంలో నమోదైన డెంగీ కేసులపై ఆరా తీసి బాధితులను కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. చుట్టు పక్కల చెత్తాచెదరం లేకుండా పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని, మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్‌లకు సూచించారు. బస్తీ దావాఖానాను సందర్శించి రికార్డులను పరిశీలించారు. డెంగీ, వ్యాధి ప్రబలకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని బృందం సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, హరిదత్తు, అజయ్‌పవార్, వసంత్, రాజేందర్, తదితరులు ఉన్నారు.



రోడ్డు భద్రత వారోత్సవాలలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

### రోడ్డు ప్రమాదాల నివారణకు

## ప్రతీఒక్కరు కృషి చేయాలి

బోధన్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాల గురించి ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. ప్రమాదాల నివారణలో ప్రతీ ఒక్కరు నియమ, నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఏకాగ్రతతో బస్సులు నడిపి బస్సులో ఉన్న ప్రజలను సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, ఎంవీఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**● విజయసాయి కళాశాలలో..**

బోధన్ పట్టణంలోని విజయసాయి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపించేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని, ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సుబ్బారావు, అధ్యాపక బృందం తదితరులున్నారు.

తెలుసుకుందాం



ఆర్మూర్‌లో పంటలపై డ్రోన్ ద్వారా పురుగుల మందును చల్లుతున్న దృశ్యం



పంటపై పురుగుమందును పిచికారీ చేస్తున్న రైతు

# పురుగుల మందుల పిచికారీ.. అనారోగ్యంతో సవారీ

**● కనీస జాగ్రత్తలు తీసుకోని రైతులు ● పొంచి ఉన్న ఆరోగ్య సమస్యలు ● పిచికారీకి సబ్సిడీపై డ్రోన్‌లను అందజేస్తే రైతులకు మేలు**

ఆర్మూర్‌రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గతంలో పంటల సాగులో రసాయానిక మందులు వాడేవారు కాదు. కేవలం సేంద్రీయ ఎరువులపై మాత్రమే ఆధారపడేవారు. పశువుల ఎరువులు, గొర్రెల, మేకల ఎరువు, చెరువులోని మట్టిని వాడి సాంప్రదాయ పద్దతిలో పంటలు సాగు చేసేవారు. రానురాను పశువుల పెంపకం తగ్గుతూ వచ్చింది. పశువుల ఎరువుల లభించని పరిస్థితులు నెలకొన్నాయి. కాలక్రమేనా సేంద్రీయ ఎరువుల స్థానంలో రసాయన, క్రిమి సంహారక పురుగు మందులు వాడుకలోకి వచ్చాయి. ప్రస్తుతం వ్యవసాయం వ్యాపారంగా మారింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పంటలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో పురుగు మందులపై ఆధారపడి పంటల సాగు ఎక్కువవుతోంది. విత్తన నాటిన మొదలు పంట చేతికి వచ్చే వరకు ఏదో ఒక రసాయన మందులు పిచికారి చేయాల్సిన లేదా వాడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పంటలకు పురుగు మందు పిచికారి చేయడానికి అవగాహన లేకపోవడంతో పలువురు రైతులు అనారోగ్య భారిన పడుతున్నారు. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకుంటే ముప్పు తప్పదు.

### పంటలపై పిచికారీ చేయాలి ఇలా

- ఎరువులు, పురుగు మందులను పంటలపై చేసే సమయంలో శరారీనికి తగలకుండా దుస్తులు పూర్తిగా తగిలించాలి. మాస్కు ధరించి కంటి అద్దాలు పెట్టుకోవాలి.
- పిచికారి చేసే సమయంలో రక్షణగా వస్త్రాలను ధరించాలి.
- గాలి దిశలో పిచికారి చేయాలి.
- పురాతన, పాడైన స్ప్రెయిర్‌లను, డస్టర్‌లను వాడవద్దు.
- పిచికారి సమయంలో ఏలాంటి ఆహార పదార్థాలు తీసుకోవద్దు. బీడీ, సిగరేట్ వంటివి తాగకూడదు.
- మందులు పిచికారి చేసేటప్పుడు విష ప్రభావానికి గురైతే పురుగు మందు డబ్బా, దాని కరపత్రం తప్పనిసరిగా వైద్యునికి చూపిస్తే సరైన చికిత్స లభిస్తుంది.

### అజాగ్రత్తగా ఉంటే ఆరోగ్యానికి ముప్పు

పంటలో క్రిమి సంహారక మందులు పిచికారి చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకొని పక్షంలో రైతుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. రసాయన గాడతతో చాతి బరువు, కళ్లు తిరగడం, గుండె వేగం తగ్గడం, పిల్లికూతలు, నీరసం, డిప్రెషన్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యునికి సంప్రదించాలి. జాప్యం చేస్తే కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఇతర క్రిమిసంహరక మందులతో పాటు గడ్డి మందు ప్రమాదకరం. దీనిని పిల్చిన, చర్మనికి తగలడం వల్ల ఊపిరి తిత్తులు గట్టిపడి కిడ్నీలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గర్భిణులు ఈ క్రిమి సంహారక మందులకు దూరంగా ఉండాలి. లేనిపక్షంలో పుట్టబోయే పిల్లలకు బుద్ధి మందగించడం, బలహీనత వంటివి కనిపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. మందులు శరీరానికి తగలకుండా పూర్తిస్థాయిలో చేతులకు గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలి.

### డ్రోన్ సర్వీస్‌లు అందుబాటులో ..

ప్రస్తుతం క్రిమి సంహారక మందులు పిచికారి చేయడానికి డ్రోన్ సర్వీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని గ్రామాల్లో వీటిని కొనుగోలు చేసిన వారు డ్రోన్‌ల ద్వారా పంటలపై క్రి మిసంహరక మందులను పిచికారీ చేస్తున్నారు.. ఇందుకు రైతులు వారికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై మహిళా సంఘాలకు అందజేస్తోంది. నేరుగా రైతులకే సబ్సిడీపై డ్రోన్‌లు అందజేస్తే రైతులు లబ్ధిపొందుతారు. అదేవిధంగా డ్రోన్‌ల వినియోగంపై గ్రామాల్లోని యువ రైతులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి సబ్సిడీపై డ్రోన్‌లు అందజేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

### సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లను అందజేయాలి

**● రోహిత్‌రెడ్డి, రైతు, పిప్రి**



పంటల పిచికారికి సబ్సిడీపై రైతులకు డ్రోన్‌లను ప్రభుత్వం అందజేయాలి. గతంలో ఎకరానికి రూ.800 చెల్లించి కూలీలచే స్ప్రే చేయించే వాళ్లం. ప్రస్తుతం కూలీల కొరత వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డ్రోన్‌ల ద్వారా ఎకరానికి రూ.600 చెల్లించి స్ప్రే చేయిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్‌లను సబ్సిడీపై రైతులకు అందజేస్తే మరింత సౌకర్యంగా ఉంటుంది.

### ప్రైవేటు పాఠశాలల సమస్యలను

## ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేద్దాం

**● ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్**



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు

బోధన్‌రూరల్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేద్దామని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల ఇందూర్ మోడల్ పాఠశాలలో మెమోంటో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయని వాటి పరిష్కారానికి ట్రస్మా కృషి చేస్తుందని వివరించారు. తల్లిదండ్రుల సేవలో ప్రైవేటు పాఠశాలలన్నీ అన్ని వేళలా ముందుకు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు సేవలు అందించడంలో ముందున్నాయని ఆయన అన్నారు. విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడంతో ప్రైవేటు పాఠశాలల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు దిగంబర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కార్తీక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు మిద్దెల రాజు, గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ, జిల్లా కోశాధికారి హన్మాండ్లు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



ఫరీద్‌పేట్‌లో నూతన గ్రంథాలయ నమునా



బాధిత కుటుంబాలకు బియ్యం అందిస్తున్న దృశ్యం(ఫైల్)

# ఫరీద్‌పేట్‌లో గ్రంథాలయ నిర్మాణం

**● హారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి పనులు ● అభివృద్ధి పనుల కోసం మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి కృషి**

మాచారెడ్డి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంతోమంది ఉన్నత విద్యావంతులకు నిలయమైన.. ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన గ్రామం పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట్.. ఈ గ్రామానికి చెందిన మాచారెడ్డి తాజా మాజీ వైస్ ఎంపీపీ జీడీపల్లి నర్సింహారెడ్డి తండ్రి, కూతురు హారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతూ కన్న ఊరులో సామాజిక సేవలు అందిస్తున్నారు. విద్యా దానమే మహాదానంగా భావించి గ్రామంలోని విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి, విద్యావంతులకు పోటీ పరీక్షలలో విజ్ఞానం పొందేందుకు గ్రామంలో ఆయన తండ్రి జీడిపల్లి మహబూబ్‌రెడ్డి, కూతురు హారిక జ్ఞాపకార్థం సుమారు రూ.20 లక్షలలో అందమైన ఆహ్లాదకరంగా ఏకాగ్రతగా ఉండేవిధంగా గ్రా మంలో రైతువేదిక పక్కన గ్రంథాలయాన్ని సొంత డబ్బులతో నిర్మిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 30న అప్పటి కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రంథాలయ భవనం వచ్చేనెల ఫిబ్రవరి 2025లో ప్రారంభోత్సవం చేయడానికి పనులు పూర్తిచేయడానికి నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు నరసింహారెడ్డి. గ్రామంలోని పేద కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఆ బాధిత కుటుంబానికి 50కిలోల సన్న బి య్యం, యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తారు. గ్రామంలో తాగు నీటి సమస్యను తీర్చడానికి 5 బోరు బావులను తవ్వించి సింగిల్‌ఫేజ్ మోటార్‌లు పంపిణీ చేశారు. గ్రామంలో దేవాలయాల వద్ద గ్రామంలోని ప్ర ధాన కూడలీల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. పెద్దమ్మ తల్లి ఆలయానికి గ్రానైట్ అందజేశారు. కుమ్మరి కుల సంఘానికి 85 గజాల సొంత స్థలం, గ్రామంలోని పూజారికి ఇంటి నిర్మాణం కోసం 50 గజాల సొంత స్థలం ఇచ్చి అందరి మన్నలను పొందారు. ఇలా గ్రామంలో ఎన్నో సేవలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రంథాలయంలో గ్రానైట్ అందంగా ఫర్నిచర్ పనులు కొనసాగుతున్నారు. కన్న ఊరికే మంచి చేయాలనే ఉద్ధేశంలో సేవలను కొనసాగిస్తూ అభివృద్ధికి తోడ్పడుతూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలో గ్రంథాలయం భవనం ఆధునిక పద్దతులతో అన్ని సౌకర్యాలతో నిర్మిస్తుండడంతో గ్రామప్రజలు నర్సింహారెడ్డిని అభినందిస్తున్నారు. ఇలా మున్ముందు మరెన్నో సేవలు చేయడానికి ముందుకు సాగుతున్నారు.



నిర్మాణంలో ఉన్న గ్రంథాలయం




కామారెడ్డిలో పొగమంచు కమ్ముకున్న దృశ్యం

## కామారెడ్డిని కమ్మేసిన పొగమంచు

కామారెడ్డిటౌన్/భిక్కనూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం కామారెడ్డితో పాటు భిక్కనూరులో గురువారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు కమ్మేయడంతో పాటు చలిగాలులు వీచాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చల్లటి గాలుల ప్రభావంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భిక్కనూరులో దాదాపు 9 గంటల వరకు పొగమంచు కారణంగా ముఖ్యంగా పాఠశాలల బస్సుల డ్రైవర్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కున్నారు.



భిక్కనూరులో..





ఫొటో న్యూస్



## కాలువంతా మొక్కలే.. నీరు పోయేదెలా..!?

నిజాంసాగర్ కాలువ పిచ్చిమొక్కలు, తీగ జాతి మొక్కలతో నిండిపోయింది. రెండో పంటకు నీటిని వదులుతున్నప్పటికీ పొలాలకు చేరాలంటే ఇబ్బందిగా మారింది. కాలువలో మట్టి ఉండడంతో పిచ్చి మొక్కలు, గొర్రపు డెక్క ఏపుగా పెరిగాయి. డిచ్‌పల్లి నుంచి మెంట్రాజ్‌పల్లి మీదుగా వెళ్లే నిజాంసాగర్ కాలువ దుస్థితి ఇది. ఎక్కడ చూసినా కాలువ అంతా పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. ఈ మొక్కల కారణంగా రైతులకు నీరు పిల్ల కాలువల ద్వారా వెళ్లడం లేదు. పొలాల్లోకి నీరు వెళ్లాలంటే పిచ్చి మొక్కలు అడ్డు వస్తున్నాయి. కాలువంతా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)

# ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

● తుజాల్‌పూర్ గ్రామంలో ఘటన


ప్రవీణ్‌గౌడ్(ఫైల్)

దోమకొండ, (బీబీపేట) జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బీబీపేట మండలం తుజాల్‌పూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన సుంకరి ప్రవీణ్‌గౌడ్(31) హైదరాబాద్‌లో ఓ హోటల్‌లో వేటర్‌గా పని చేస్తున్నాడు. స్వగ్రామంలో ఆరు నెలల కిందట కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో సుమారు రూ.3లక్షలకు పైగా రుణం తీసుకున్నాడు. ప్రతీ నెల రూ.8000 చొప్పున కిస్తులు కడుతూ వస్తున్నాడు. కాగా రెండు నెలలుగా కిస్తీ డబ్బులు కట్టకపోవడంతో సంబంధిత ఫైనాన్స్ సిబ్బంది ప్రవీణ్‌గౌడ్‌ను గత మూడు రోజుల నుంచి ఫోన్‌లో ఇబ్బందులకు గురిచేసినట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే కిస్తీ డబ్బులు తీర్చేందుకు హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చి డబ్బులు సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించాడు. కానీ ఎక్కడా కూడా సర్దుబాటు కాకపోవడంతో మనోవేధనకు గురైనట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. దీంతో మనస్థాపానికి గురైన ప్రవీణ్‌గౌడ్ బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి అతని సోదరునికి ఆర్థిక ఇబ్బందులతో తాను చనిపోతున్నానని ఫోన్ ద్వారా తెలిపి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపుగా వెళ్తున్న గ్రామస్థులు ఉదయం ప్రవీణ్‌గౌడ్ చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గమనించి కుటుంబసభ్యులకు తెలిపారు. విషయం తెలుసుకున్న బీబీపేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల వివరాలను తెలుసుకున్నారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## సీసీ కెమెరాల కోసం రూ.50 వేల అందజేత


సీఐకి డబ్బులు అందిస్తున్న కాలనీవాసులు

కామారెడ్డి టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 38,39 వార్డుకు సంబంధించి ప్రియాడిలక్స్‌రోడ్డులో సీసీకెమెరాల కోసం అవగాహన కార్యక్రమాన్ని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రాంతానికి,బస్టాండ్ ప్రాంతానికి ఈ రెండు వార్డులు దగ్గరలో ఉండడంతో పాటు పలు వ్యాపార విభాగాలు ఉన్నందున ఏదైన చోరి జరిగిన వెంటనే దుండగులను గుర్తించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. రాబోయే వారం రోజుల్లో సీసీకెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. దీంతో పలువురు కమిటి సభ్యులు రూ.50వేలు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు మోటూరి శ్రీకాంత్, చాట్ల రాజేశ్వర్, ట్రాఫిక్ ఎస్‌ఐ మహేష్,వార్డుఅభివృద్ధి కమిటి అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

## బీసీ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురవారం మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ బీసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఏకతాటిపై నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి గొంట్యాల బాలకృష్ణ బాన్సువాడ డివిజన్ యూత్ ఇంచార్జి భూషణం, యోగి హన్మాండ్లు, సాత్విక్ తదితరులున్నారు.

## న్యాయశాఖ ఉద్యోగుల డైరీ..


న్యాయశాఖ డైరీని ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

కామారెడ్డిటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): న్యాయశాఖ ఉద్యోగుల సంఘం డైరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, న్యాయవాదులకు అవసరమైన సహకారం అందించడంలో ప్రతి ఉద్యోగి ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జమాలపూర్ భూజంగరావు,ప్రధాన కార్యదర్శి నిమ్మ వెంకట్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి నాగేంద్ర, ఉపాధ్యక్షులు రషీద్అలీ, రమేష్‌గౌడ్, సాయిబాబా, పరిపాలన అధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.




కామారెడ్డిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ


సంగమేశ్వర్‌లో..


బస్వాపూర్‌లో..

# అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు



బాన్సువాడ ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులను అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన పట్టణంలోని 14, 15 వార్డు సభలో పాల్గొని మాట్లాడారు. ఇతర పార్టీల నాయకులు చెప్పే తప్పుడు వదంతులు నమ్మవద్దని, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందన్నారు. ఈ నెల 26 నుంచి రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు, ఖాళీ స్థలం ఉన్నవారికి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఛైర్మెన్ కాసుల బాల్‌రాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ప్రజాప్రతినిధులు

### ముమ్మరంగా వార్డు సభలు

**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 24, 26, 30, 47 వార్డుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆయా వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. 47వ వార్డులో స్థానిక కౌన్సిలర్ స్వప్న వార్డులో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి దగ్గరుండి నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో అందరికి సమానంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన్, ఆర్‌వో గోపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట:** మండలంలోని పొందుర్తి, కొండాపూర్, శేర్‌శంకర్‌తండా, గుడితండా గ్రామాల్లో గురువారం మూడో రోజు గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీవో రఘురాం తెలిపారు. నాలుగు గ్రామాలకు సంబంధించి 810 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అపర్ణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ:** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు పథకాలకు సంబంధించి ప్రజలు ఆందోళన చెందవద్దని, లిస్టులో ప్రస్తుతం పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. గురువారం దోమకొండ మండలంలోని సంగమేశ్వర్, అంబార్‌పేట, ముత్యంపేట, బీబీపేట మండలంలోని ఇస్సానగర్, జనగామ, మాందాపూర్, యాడారం గ్రామాల్లో ఆయా గ్రామాల్లోని ప్రత్యేక అధికారుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో బీబీపేట ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, తహసీల్దార్, సత్యనారాయణ, నాయాబ్ తహసీల్దార్ రేఖ, ఏవోలు మణిదీపిక, నరేందర్, ఏఈవోలు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**భిక్కనూరు:** మండలంలోని బస్వాపూర్, రామేశ్వర్‌పల్లి, కంచర్ల, మల్లుపల్లి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో అర్హులకు కాకుండా అనర్హులకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తే సహించేది లేదని అధికారులకు సూచించారు. ఈ మేరకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

**పెద్ద కొడప్‌గల్:** ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. లింగంపల్లిలో కిరణ్మయి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, ఇందులో భాగంగానే ప్రస్తుతం 4 పథకాలు అమలు చేస్తుందని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. జుక్కల్ మండలంలోని లొంగన్ గ్రామంలో జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలు ఏ పథకానికి అర్హులుగా ఉన్నారో ఆ పథకం మంజూరు కాకపోతే దానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### మల్లాపూర్‌లో అధికారుల నిలదీత

**బీర్కూర్:** వ్యవసాయ భూములు కలిగిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎలా అందిస్తారని ప్రజలు అధికారులను నిలదీశారు. గురువారం బీర్కూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సభలో ఇందిరమ్మ ఆత్మీ భరోసా జాబితాను అధికారులు సభాముఖంగా చదివి వినిపించారు. కాగా వ్యవసాయ భూములు కలిగి ఉన్న వారి పేర్లు జాబితాలో ఉండడంతో గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఇదిలా ఉండగా సంభాపూర్ గ్రామ సభలో అర్హులైన తమకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. చించొల్లి గ్రామసభలో ఇందిరమ్మ ఇళ్లు తమకెందుకు మంజూరు చేయలేదని అధికారులను ప్రజలు ప్రశ్నించారు. రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రకాశ్, ఎంపీవో మహబూబ్, ఆయా శాఖల అధికారులున్నారు.

**సదాశివనగర్:** మండలంలోని ఉత్తనూర్ గ్రామసభలో గందరగోళం నెలకొంది. ప్రజాపాలన గ్రామసభలో పాల్గొన్న ఎంపీడీవో, పంచాయతీ సెక్రెటరీలను గ్రామస్థులు నిలదీశారు. ఇప్పటి వరకు దరఖాస్తులు నామమాత్రమేనని ఎవరైన అసలైన అర్హులకు పథకాలు అందని పక్షంలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తామని ప్రజలకు తెలిపారు.

**నాగిరెడ్డిపేట:** మండలంలోని 8 గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలను అధికారులు నిర్వహించారు. మండలంలోని మల్తుమ్మెద, అచ్చయపల్లి, ఆత్మకూర్, చీనూరు, ధర్మారెడ్డి, లింగంపల్లి, పల్లెబోగడ తండా, పోచారం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా మల్తుమ్మెదలో గ్రామసభలో మండల ప్రత్యేకాధికారిణి రత్నం పాల్గొని లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. జాబితాలో లేని అర్హులైన వారు గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, ఎస్‌ఐ మల్లారెడ్డి, ఆర్‌ఐ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### అర్ధాంతరంగా ముగిసిన గ్రామసభ

**లింగంపేట:** మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారి అర్ధాంతరంగా ముగిసింది. సభ ప్రారంభం కాగానే రేషన్‌కార్డుల పేర్లు చదివి వినిపించారు. లింగంపేట మేజర్ గ్రామ పంచాయతీకి కేవలం కొత్తగా 79 రేషన్‌కార్డులు మాత్రమే రావడం పట్ల గ్రామస్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుల కోసం గతంలోనే దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఎందుకు రాలేదని మహిళలు అధికారులను నిలదీశారు. రేషన్‌కార్డులతో పాటు ఇందిరమ్మ గృహాలు సైతం అర్హులకు రాలేదని ఆరోపించారు. తాము కూలీ పనులు వదులుకుని దరఖాస్తులు చేసుకుంటున్నామని కార్యాలయాల చుట్టు తిరుగుతున్నా మాకు రావడం లేదని వారు ప్రశ్నించారు. గ్రామసభ రసాభాసగా మారడంతో లబ్ధిదారులకు సమాధానం చెప్పేవారు కరువయ్యారు. గ్రామసభను ఉద్దేశించి ఏడీఏ మాట్లాడేందుకు ప్రయత్నించగా లబ్ధిదారులు వినకుండా అధికారుల చుట్టూ చేరారు. దీంతో ఆమె మాట్లాడకుండా వెళ్లిపోయారు. గ్రామసభలో గంటకు పైగా గందరగోళ వాతావరణం ఏర్పడింది. దీంతో అధికారులు గ్రామసభను అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. పోలీసు అధికారులు గ్రామస్థులను సముదాయించినా వినకుండా అధికారులను నిలదీశారు. అధికారులు వెళ్లిన తరువాత పంచాయతీ కార్యాల యంలో ఏర్పాటు చేసి కౌంటర్‌లో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఏ రత్నం, ఎంపీడీవో నరేష్, ఎంపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, నాయకులు శంకర్‌గౌడ్, రాజు అశోక్, ఎల్లమయ్య, ప్రసాద్‌గౌడ్‌లతో పాటు నాయ కులు అధికారులు ఉన్నారు.

**ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్ల, బిక్కనూర్ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సభను ఉద్దేశించి ఎంపీడీవో ప్రకాశ్ మాట్లాడుతూ.. అర్హులైన వారిని గుర్తించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు ఇలాంటి సంక్షేమ పథకాలు ఇస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రేషన్‌కార్డు గురించి గ్రామ కార్యదర్శి ప్రత్యేక అవగాహన కల్పించడంతో అధిక సంఖ్యలో రేషన్‌కార్డు దరఖాస్తులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంతోష్, సాయిలలు, భాస్కర్ అధికారులు ఉన్నారు.


నాగిరెడ్డిపేటలో..


మల్లాపూర్‌లో..


లింగంపల్లిలో..

# సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

దోమకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**భిక్కనూరు:** మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ, ఆయా యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో చంద్రబోస్ విగ్రహాలకు, చిత్రపటానికి బీజేపీ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయంతే తప్పా వర్ధంతి లేని గొప్పవ్యక్తి నేతాజీ అని, ఆయన సేవలను, ధైర్యాన్ని కొనియాడారు.

**కామారెడ్డి టౌన్:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని సుభాష్‌రోడ్డులోగల ఆయనవిగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ సమయంలో గాంధీజీ లాంటి నాయకులు అహింసనే ఆయుధంగా చేసుకోని పోరాటం చేస్తుంటే సుభాష్ చంద్రబోస్ లాంటి నాయకులు యువకులను ప్రోత్సహిస్తు ఆంగ్లేయుల దౌర్జన్యాన్ని అడ్డుకుంటు స్వాతంత్ర భారతదేశానికై పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం చిన్నరాజులు, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, భరత్, నరేందర్, వేణు పాల్గొన్నారు.

**బిచ్కుంద:** మండల కేంద్రంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


దోమకొండలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం


బస్వాపూర్‌లో..

### పెద్ద ఏడ్గిలో..

**పెద్ద కొడప్‌గల్:** జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామంలో గురువారం నేతాజీ జయంతోత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామ చౌరస్తాలో నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ దేశం కోసం ఎనలేని సేవ చేసిన మహనీయుడు నేతాజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిల్‌వార్ రమేష్, జాదవ్ ఆనంద్, సుంకరి శ్రీనివాస్, సందీప్ నాయక్, విజయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడటౌన్:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురవారం బాన్సువాడ పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఘనంగా నిర్వహించారు. నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన వీరుడు నేతాజీ అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి స్వాతంత్ర్యం కోసం మీరు రక్తాన్ని దార పోయండి, మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తానని ఆయన అన్న మాటలను గుర్తు చేసుకున్నారు. యువత నేతాజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడుగుట్ల శ్రీనివాస్, శ్రీధర్, సాయిలు, కోనాల గంగారెడ్డి, నాయకులు తదితరులున్నారు.


బీర్కూర్‌లో నేతాజీ జయంతి వేడుకల్లో విద్యార్థులు


బాన్సువాడలో నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

**బీర్కూర్:** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల విద్యాలయంలో గురువారం నేతాజీ జయంతి వేడుకలు నెహ్రూ యువకేంద్రం, ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివకుమార్, సరిత, సునీల్‌రాథోడ్, విద్యార్థులు తదితరులున్నారు.

**నాగిరెడ్డిపేట:** మండల కేంద్రంలోని సిద్దార్థ జూనియర్ కళాశాలలో గురువారం నేతాజి సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు వినోద్, కళాశాల ప్రిన్సిపల్ మన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి పడి యువకుడి మృతి


మృతిచెందిన మహిపాల్

సదాశివనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలకేంద్రానికి చెందిన మున్నూరు మహిపాల్ (40) బైక్ అదుపు తప్పి కిందపడి మృతి చెందినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## ఎల్లారెడ్డిలో ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ఎల్లారెడ్డి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. మొత్తం 46 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి హాజీపూర్ తండాకు, ద్వితీయ బహుమతి ఎల్లారెడ్డిలు గెలుచుకున్నాయి. మొదటి బహుమతి రూ.12777, ద్వితీయ బహుమతి రూ.8777 లను విజేతకు డీఎస్పీ శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్ నాయక్, మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రజితరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, కురుమ సాయి బాబా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| శాంతి | - సంక్రాంతికి వస్తున్నాం |
| దర్శన్ | - పుష్ప-2 |
| ప్రియా 70 | - డాకు మహారాజ్ |
| ప్రియా 35 | - గేమ్ చేంజర్ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | - గేమ్ చేంజర్ |
| వెంకటేశ్వర | - డాకు మహారాజ్ |

## చికెన్ ధరలు



| రకం | : | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|---|
| సుగుణ (కిలో) | : | 120 | 140 | 160 |
| వెన్‌కాబ్(కిలో) | : | 130 | 160 | 190 |

